అంధకారం... భయంకరం!

- చీకట్లో పారిశ్రామిక ప్రాంతం
- వీధిదీపాల నిర్వహణ అంతంతమాత్రమే
- రాత్రివేళ భీతిల్లుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సింధియా నుంచి మల్కాపురం ప్రధాన రహదారిలో వెలగని వీధి లైట్లు



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద చీకట్లో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు

సింధియా: పారిశ్రామిక ప్రాంతం చీకట్లోనే మగ్గిపోతుంది. ముఖ్యంగా విద్యుత్ దీపాల నిర్వహణలో అధికారులు అంతులేని నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం అయితే భయంతో వణుకుతున్నారు. అధ్వాన రోడ్లు.. ఆపై అంధకారంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కొంతమంది చీకటి పడిన తర్వాత బయటకు రావడానికి జంకుతున్నారు. ఇందుకు మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న ప్రధాన రహదారిపై వీధి దీపాల నిర్వహణే నిదర్శనం.



ప్రకాష్‌నగర్‌లో వెలగని వీధిలైట్లు

ఇదీ పరిస్థితి

షిప్‌యార్డ్ నుంచి హెచ్‌పీసీఎల్‌కు భారీ యంత్రాలను తరలించే ప్రక్రియలో భాగంగా మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న వీధి దీపాలను, రోడ్డు మధ్యలో డివైడర్‌తో సహా తొలగించారు. దీంతో చీకటి పడితే ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా ఈ మార్గంలో వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా చీకట్లో ప్రయాణించడంతో అనేక రోడ్డు ప్రమాదాలు కూడా జరిగాయి. ఇక రాత్రిళ్లు వీధి లైట్లు వెలగక వాహన చోదకులు నానా తంటాలు పడుతుంటే, కొన్ని ప్రాంతాల్లో పట్టపగలు వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నా సంబంధిత అధికారుల వాటిపై దృష్టి సారించడంలేదు. సమస్యలపై జీవీఎంసీ, విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెలరేగుతున్న ఆకతాయిలు

మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న రోడ్డులో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. మద్యం తాగి విద్యుత్తు దీపాలపై పడుతున్నారు. మద్యం సీసాలతో విద్యుత్ దీపాలను పగలుగొడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి మెత్తం చీకటి

జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ నుంచి ఇటు మల్కాపురం పోలీస్‌స్టేషన్, అటు యారాడ మార్గాల వైపు వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. క్రాంతినగర్‌లోనే కాకుండా సింధియా నుంచి మల్కాపురం వరకు ప్రధాన రహదారిలో సైతం వీధిలైట్లు వెలగక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొందరు టార్చిలైట్ల వెలుగుతో ప్రయాణిస్తున్నారు. రహదారి చీకటిమయం కావడంతో పాదచారులు భయపడే పరిస్థితి నెలకొంది. కీటకాలు, పాములు సంచరిస్తాయనే భయంతో పాదచారులు చీకటిని అధిగమించే క్రమంలో పరుగులు తీస్తూ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. నూతన ప్రభుత్వం వచ్చి ప్రజలకు ఏదో చేస్తుందనే ఆశతో ఉన్న ప్రజలకు అడియాశలే మిగిలాయి. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి నాయకులు పండగ చేసుకుంటున్న క్రమంలో ప్రజా సమస్యలపై స్పందించాలని పలువురు కోరుతున్నారు.

వీధిలైట్లు వేయాలి



మల్కాపురం నుంచి సింధియా వరకు వీధిలైట్లు సరిగ్గా వెలగకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. ఈ దారిలో ప్రయాణించాలంటే భయపడుతున్నాం. భారీ వాహనాలు రోడ్డుపై నిలపడంతో చీకట్లో గుర్తించలేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీధిలైట్లు సంఖ్య పెంచి నిత్యం వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– రామలక్ష్మి, 62వ వార్డు

చీకట్లో ప్రయాణిస్తున్నాం



మల్కాపురం ప్రధాన రహదారితో పాటు 62,63 వార్డులోని పలు వీధుల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో చీకట్లో ప్రయాణిస్తున్నాం. చీకటి పడితే బయటకు రావాలంటే భయంగా ఉంటోంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అవసరమైన చోట కొత్త లైట్లు వేయడంతో పాటు ఉన్నవి సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– కృష్ణవేణి, మల్కాపురం

రూటు మారింది

- ములగాడ సేవా మార్గంలో మరమ్మతులు
- అలూఫ్లోరైడ్ పక్క నుంచి దారి మళ్లింపు
- వాహనదారులు గుర్తించాలని అధికారుల సూచన



నిలుపుదల చేసిన శ్రావణి షిప్పింగ్ పక్క మార్గం



అలూఫ్లోరైడ్ పక్క నుంచి వేసిన కొత్త మార్గం ఇదే



రోడ్డు నిర్మాణం కోసం పరిశీలన చేస్తున్న అధికారులు

మల్కాపురం: గుంతలమయంగా ఉన్న సేవా మార్గాన్ని తాత్కాలికంగా మూసి సేశారు. మరో మార్గం ద్వారా వాహనాల రాకపోకలకు అనుమతులు ఇచ్చారు. అధ్వానంగా ఉన్న శ్రావణిషిప్పింగ్ రోడ్డును అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టారు. డాక్‌యార్డ్ వద్ద గల సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మమర్మతుల కారణంగా వాహనాల రాకపోకలు గతేడాది నుంచి నిలిపివేసిన విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక ప్రాంత వాహనదారుల కోసం ములగాడ గ్రామం నుంచి శ్రావణి షిప్పిగ్,మారుతీ సర్కిల్ మీదుగా నగరానికి చేరుకునే అవకాశం కల్పించారు. అయితే శ్రావణి షిప్పింగ్ నుంచి మారుతీ సర్కిల్ వరకు వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయం కావడంతో వాహనదారులతో పాటు,ములగాడ గ్రామస్తులు వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో పోర్టు అధికారులతో పాటు జీవీఎంసీ కమిషనర్,జిల్లా కలెక్టర్‌కు వినతులు అందించి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన అధికారులు ఎట్టకేలకు శ్రావణి షిప్పింగ్ నుంచి మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో మరమ్మతులు చేసేందుకు పోర్టు అధికారులు ముందుకు వచ్చారు. ఈ పనులు పూర్తయ్యే వరకు ములగాడ విలేజ్ వద్ద గల అలూఫ్లోరైడ్ సంస్థ పక్క మార్గం ద్వారా నగరానికి వెళ్లే వాహనదారులకు అవకాశం కల్పించారు.

శాస్త్ర సాంకేతికాంశాల్లో నైపుణ్యం సాధించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్

గోపాలపట్నం: విద్యార్థి దశలోనే చదువుతోపాటు శాస్త్ర సాంకేతికాంశాల్లో నైపుణ్యం సాధించాలని బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ సూచించారు. కళాశాలలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో మంగళవారం నైపుణ్య సాధన అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మనం కూడా అప్‌డేట్ కావాలన్నారు. సృజనాత్మకంగా ఆలోచనలు ఉండాలని, నూతన ఆవిష్కరణల కోసం అన్వేషిస్తుండాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే కృషి, పట్టుదల, కొత్త విషయాలు నేర్చుకునే తాపత్రయం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు మాధురి, దుర్గాప్రసాద్, అమూల్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్ రంగనాథన్ జయంతి



గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులు..



రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ వర్మ తదితరులు

గోపాలపట్నం: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని మంగళవారం గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి విశ్రాంత తహసీల్దార్ ఆర్. రఘురామ్, గ్రంథాలయాధికారి ఎస్వీ నరసింహం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగనాథన్ గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు.

ఇంజినీరింగ్ కళాశాలలో .. నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయంలో రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రసాద్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. వీరు మాట్లాడుతూ లైబ్రేరియన్లకు మార్గ దర్శకుడైన రంగనాథన్ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. కార్యక్రమంలో డీన్ శాంతారావు, గాయత్రి, రామ్, లైబ్రేరియన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలివ్వాలి

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి అమలు చేసేందుకు చూస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం గురించి పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ద్వారకానగర్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆదాయం కోల్పోయే ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని, వాహనమిత్ర రూ.15 వేలు విడుదల చేయాలని, జీవో 21 రద్దు చేసి డ్రైవర్లకు జీవించే హక్కు కల్పించాలన్నారు.

మెట్రో రైల్ ప్రాజెక్ట్‌పై సమీక్ష



ఎన్ఏడీ జంక్షన్‌లో మెట్రో ప్రాజెక్ట్ అధికారులతో కలిసి పర్యటిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం: మెట్రో రైల్ రానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇబ్బందులపై మెట్రో అధికారులతో కలిసి మంగళవారం ఎన్ఏడీ జంక్షన్‌లో ప్రభుత్వ విప్ గణబాబు పర్యటించారు. అధికారులతో సమీక్షించి తన సందేహాలను నివృత్తి చేసుకుని పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ మెట్రో రైల్ నిర్మాణంలో భాగంగా భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ఉండేలా అవగాహన కోసం అధికారులతో కలిసి పర్యటించామని తెలిపారు. భవిష్యత్తులో ఎన్ఏడీ జంక్షన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. బస్సు ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించామన్నారు. ఎన్ఏడీ జంక్షన్ వద్ద ఒక మెట్రో స్టేషన్, కాకానినగర్ వద్ద ఒక స్టేషన్ ఉంటుందని చెప్పారు. ప్రైవేటు స్థలాలను కూడా ఎక్వైర్ చేయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. పర్యటనలో మెట్రో ప్రాజెక్ట్ చీఫ్ ఫైనాన్స్ మేనేజర్ యు.జె.ఎం.రావు, ప్రాజెక్ట్ మేనేజర్ వసంత్, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, వై.తిరుమలరావు, శరగడం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ విద్యుత్ మీటర్లను అడ్డుకోవాలి



స్మార్ట్ మీటర్లు వద్దంటూ షిప్‌యార్డ్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సింధియా: అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు స్వచ్ఛందంగా తిరస్కరించాలని షిప్‌యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు పిలుపునిచ్చారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ గేటు వద్ద పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అదానీ స్మార్ట్ మీటర్లు బిగించాలనే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని కోరుతూ మంగళవారం నిరసన తెలిపారు. సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు పెంటారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్గనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల రీడింగును సిబ్బందితో తీయించే ప్రక్రియ సజావుగా సాగుతుందన్నారు. కానీ ప్రభుత్వం అదానీ ప్రయోజనాలకు అనుగుణంగా బాగా పనిచేస్తున్న మీటర్లును తొలగించి, స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదేశించడం అన్యాయమన్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామంటే నాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత మంత్రి నారా లోకేష్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ, అదానీ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి అధికారం ఇస్తే విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ప్రోత్సహించడం సమంజసం కాదన్నారు. ఇది ప్రజలను నమ్మించి మోసం చేయడమే అవుతుందని, వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగించి, స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పైడిరాజు, సత్యారావు, నరేష్, శ్రీను, వాసు, సమీన్, రాజు, రాజేష్ పాల్గొన్నారు.



బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెంలోరి బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక మంగళ గౌరీ వ్రతంలో పాల్గొని గౌరీ దేవికి పూజలు చేశారు. చల్లగ చూడు తల్లీ అని వేడుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు పూజా సామగ్రి సమకూర్చారు. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

యువత గ్రంథాయాలను సద్వినియోగం చేసుకోవాలి



అధ్యాపకుడు మురళీధర్‌ను సత్కరిస్తున్న అధికారులు,యువత

మల్కాపురం: యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞావంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సార్వత్రిక విశ్వవిదాలయం లైబ్రేరీ సైన్స్ అధ్యాపకుడు డి.మురళీధర్ అన్నారు.ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. తొలుత శాఖా గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్‌తో కలిసి రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మురళీధర్ మాట్లాడుతూ నేటి యువత ఎస్.ఆర్. రంగనాథన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తమిళనాడులో జన్మించిన రంగనాథన్ గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన సేవలకు గాను 1957లో భారత ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ అవార్డుతో సత్కరించిందని వివరించారు. కార్యక్రమంలో మల్కాపురం ప్రభుత్వ ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



చిన్నారులకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

మల్కాపురం: ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులకు చెక్ పెట్ట వచ్చునని అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి అన్నారు. ములగాడ హౌసింగ్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. ఏపీ వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దైవ జ్ఞానం మోక్షదాయకం



పరమాత్ముడి జెండా ఎగురవేస్తున్న బ్రహ్మకుమారీలు

మల్కాపురం: నచ్చిన దైవాన్ని ఇష్టంగా ఆరాధిస్తే మనిషి మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుందని, నిత్యం దైవ జ్ఞానం ఎంతో మోక్షదాయకని బ్రహ్మకుమారీ సంస్థ వీ(శ్రీహరిపురం బ్రాంచ్) ఇన్‌చార్జి సింధు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పరమాత్ముడి జెండా ఎగురవేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జెండా ఎగురవేసి మాట్లాడుతూ పరమాత్ముడి సందేశాన్ని భక్తులకు వివరించారు. చెడు వ్యసనాలు వద్దని, మంచి స్నేహం ఎల్లప్పుడూ మనకు నీడలా తోడుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.


ఘనంగా గణపతి పూజలు



పూజలు అందుకున్న గణనాథుడు

మల్కాపురం: శ్రావణ మాసం,సంకట చతుర్థి సందర్భంగా స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉమాశంకర్ ఆధ్వర్యంలో గణనాథుడికి సుగంధ పుష్పాలు,జిల్లేడు పువ్వులు,గరికతో పూజలు చేపట్టారు. సాయంత్రం పంచామృతాభిషేకాలు,లడ్డూలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. కొంతమంది భక్తులు 101 ప్రదక్షిణలు చేశారు.

బుల్స్‌పై రాయల్స్ విజయం



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ 3 వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 4 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో హిమకర్ (81), రేవంత్ (69) రాణించారు. ప్రతిగా రాయల్స్ మరో రెండు బంతులుండగానే ఏడు వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెప్టెన్ హనుమవిహారి (37), పాండురంగరాజు (20), రాహుల్(52), విజయ్(36), అయ్యప్ప(26) రాణించారు.

గర్జించిన వైజాగ్ లయన్స్

మరో మ్యాచ్‌లో వైజాగ్ లయన్స్ జట్టు విజయవాడ సన్‌షైనర్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌షైనర్స్ 8 వికెట్లకు 185 పరుగులు చేసింది. కెప్టెన్ అశ్విన్‌హెబ్బర్(30), అభినవ్(29), తేజ(33), కెఎస్ఎన్ రాజు(53) రాణించారు. యశ్వంత్ 4 వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు తీశారు. ప్రతిగా వైజాగ్ లయన్స్ వీరారెడ్డి(104) సెంచరీతోను, రికీబుయ్(58)అర్ధసెంచరీతో రాణించి విజయతీరాలకు చేర్చారు.